క్లుప్తంగా...

ఆర్థిక సాయం అందజేత

గోల్కొండ: బీసీ, ఓబీసీ కుల వృత్తుల వారికి తమ పార్టీ ఎప్పుడు అండగా ఉంటు వస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన మొగల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బీసీ, ఓబీసీ కుల వృత్తుల వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులందరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేశానని అన్నారు. దళితబంధుతో పాటు మైనార్టీలకు సైతం తాను ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించామని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఓబీసీ విభాగం అధికారులతో పాటు పలువురు మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



చార్మినార్: మొహర్రం సంతాన దినాల్లో భాగంగా 40వ రోజు సందర్భంగా అర్బయిన్‌ను పురస్కరించుకొని రూపొందించిన ప్రత్యేక అర్బయిన్–2023 పోస్టర్‌ను మంగళవారం మాజీ కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీతో బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ కలిసి ఆవిష్కరించారు.

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

నాంపల్లి: పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలని మధ్య మండలం డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం నాంపల్లి శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్‌హిల్స్ ఫెడరేషన్ హౌస్‌లో పీస్ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ మండప నిర్వాహకులు, మైత్రి కమిటీ సభ్యులతో శాంతి సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరం ప్రశాంతమైన వాతావరణానికి తార్కాణమని చెప్పారు. వినాయక చవితితో పాటుగా గణేష్ నిమజ్జన మహోత్సవానికి ఎలాంటి ఆటంకం కలుగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఆనంద్, ఏసీపీలు సంజయ్‌కుమార్, రవికుమార్, యాదగిరి, చంద్రశేఖర్, పీస్ కమిటీ అధ్యక్షుడు శశికాంత్, మైత్రి కమిటీ సభ్యులు, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసులో ఇద్దరికి జైలు

విజయనగర్‌కాలనీ: మద్యం మత్తులో ఓ ఇంటి తలుపులు పగలగొట్టి చొరబడి న్యూసెన్స్ సృష్టించిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం 2 రోజుల జైలుశిక్ష విధించిన ఘటన మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మాసబ్‌ట్యాంక్ నెహ్రూనగర్‌కు చెందిన ఎ.సాయి నిఖిల్(25), బి.శేఖర్(24)లు ప్రైవేటు ఉద్యోగులు. గత వారం వీరిరువురు తాగిన మత్తులో అదే బస్తీలో ఉన్న ఓ ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి న్యూసెన్స్ సృష్టించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని నాంపల్లి 12 మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా కేసు వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి మనోరంజన్ నిఖిల్, శేఖర్‌లకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

జీఓ నెం.98ను రద్దు చేయండి

అబిడ్స్: తెలంగాణ ప్రభుత్వం ఆదాయం కోసమే జీఓ నెం.98ను తీసుకువచ్చి విచ్చలవిడి మద్యంను అమ్మకాలు చేస్తుందని యాదాద్రి భువనగిరి వేములకొండ ప్రాంతానికి చెందిన సామాజిక వేత్త వేముల నరేందర్ డిమాండ్ చేశారు. మద్యం షాపులు, బార్‌లను ఏర్పాటు చేసి అడ్డగోలుగా మద్యం విక్రయాలు చేస్తుండడంతో మహిళలతో పాటు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం 98 జీఓను రద్దుచేసి సవరించాలని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ముషరఫ్ ఫారూఖికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ.. 98 జీఓ ప్రకారం మద్యం సీసాల మీద ఆరోగ్యానికి హానికరమని రాసిపెడుతూ ఒక వ్యక్తి ఎంతైనా అమ్మవచ్చు, కొనవచ్చు అనే విధంగా నిబంధనలు ఉండడంతో మద్యం విచ్చల విడిగా ఏరులై పారుతుందన్నారు. ఒక వ్యక్తికి రోజుకు ఎంత మద్యం కావాలో అంతే మద్యాన్ని ప్రభుత్వం విక్రయిస్తే బావుంటుందని ఆయన అన్నారు. సరికొత్త జీఓను తేవాలని డిమాండ్ చేశారు.

కార్లను అద్దెకు తీసుకొని మార్టిగేజ్ చేసిన వ్యక్తి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: అద్దెకు తీసుకున్న కార్లను మార్టిగేజ్ చేసిన వ్యక్తిని చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సౌత్ ఈస్ట్ డీసీపీ రూపేష్, చాంద్రాయణగుట్ట ఏసీప మనోజ్ కుమార్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. మహ్మద్ అస్లాం నవాజ్ కార్లను అద్దెకు తీసుకొని వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ఎనిమిది కార్లు అద్దెకు తీసుకొని..సొంత కార్లుగా చెప్పుకొని బ్యాంక్‌లో మార్టిగేజ్ చేసుకున్నాడు. బాధితుడు నోముల సాయిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రూ.కోటి విలువైన ఎనిమిది కార్లను స్వాధీనం చేసుకన్నారు. ఈ సమావేశంలో చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. జలదిగ్బంధం



మల్లేపల్లిలో నీట మునిగిన పచ్చకామెర్ల దవాఖానా

భారీ వర్షానికి అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు మంగళవారం నీటమునిగాయి. వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ వర్షపు నీటితో నిండి పోయాయి. వివిధ పనులు, ఉద్యోగాలకు వెళ్లే వారు నానా ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి సహాయ చర్యలు చేపట్టారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



గెలాక్సీ రోడ్డులో..



టోలిచౌకి-టూమ్స్ రోడ్డు



బాగ్దాద్ కాలనీలో వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



పురానాపూల్ వద్ద ఉధృతంగా పారుతున్న నీరు



టోలిచౌకి నదీంకాలనీలో..



100 ఫీట్ల జాతీయ రహదారిని మూసివేసిన దృశ్యం



యాకుత్‌పురా ఆర్‌యుబీ వద్ద..



దబీర్‌పురా బోధే అలీషా కిడికి రోడ్డులో..



మూసీలో వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

విజయనగర్‌కాలనీ: వినాయక చవితి, మిలాద్ ఉన్‌నబీ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో సెంట్రల్ పీస్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోదరభావం, ఒకరి మనోభావాలను మరొకరు గౌరవిస్తూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, అడ్మిన్ ఎస్ఐ మహ్మద్ జాహేద్, సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు మోజం అలీ, చలపతిరావు, యూసుఫ్‌లతో పాటు పీఎస్ ఎస్ఐలు, సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పీస్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఏసీపీ

ఇబ్బందులు లేకుండా గణేష్ విగ్రహాలు తరలించేందుకు కృషి



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్

అబిడ్స్: గణేష్ విగ్రహాలు ధూల్‌పేట నుంచి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు కృషి చేస్తారని ట్రాఫిక్–3 డీసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. రహింపురాలో నిర్వహించిన గణేష్ విగ్రహాల తయారీదారులు, స్థానిక నాయకులు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల కో ఆర్డినేషన్ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. విగ్రహాల తయారీదారులు, విగ్రహాలు తీసుకువెళ్లేవారు పోలీసుల నిబంధనలు పాటించాలన్నారు. కొన్ని రహదారుల వెంబడి తరలించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాము సూచించిన రహదారుల మీదుగా విగ్రహాలను తరలిస్తే ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్‌వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.మహేష్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, అశోక్‌కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శివలాల్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, జితేందర్ సింగ్

అబిడ్స్: దివంగత మాజీ ఎమ్మెల్యే శివలాల్ వర్ధంతి నిర్వహించారు. ధూల్‌పేట్‌లో ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, విద్యావేత్త రిలయన్స్ హైటెక్‌స్కూల్ విద్యాసంస్థ డైరెక్టర్ జితేందర్ సింగ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. శివలాల్ సమాజానికి చేసిన సేవలు స్థానికుల గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటాయన్నారు. లోధ్ కులస్తులతో పాటు అన్నివర్గాల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి శివలాల్ జీవితాంతం కృషిచేశారని కొనియాడారు.

బీసీ కులవృత్తిదారులకు చెక్కుల పంపిణీ

జియాగూడ: కేసీఆర్ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి బీసీ బంధు చెక్కులను పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. మంగళవారం కార్వాన్‌లోని ఫంక్షన్‌హాల్‌లో లక్షరూపాయల చెక్కులను సుమారు 300 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌సాగర్, జగదీష్‌యాదవ్, రాములు, సమద్ వార్షి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్, బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ

నీటి వనరులను పెంపొందించుకోవాలి



సెమినార్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రకాష్, డాక్టర్ గంగాధర్, జీవీ రంగారెడ్డి, ఆదిత్యమార్గం

అబిడ్స్: మానవాళి మనుగడను కాపాడుకునేందుకే నీటి వనరులను పెంపొందించుకోవాలని రాష్ట్ర వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ చైర్మన్ వి.ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఎకానామిక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కన్జర్వింగ్ అవర్ న్యాచురల్ వాటర్ అండ్ మ్యాన్‌మేడ్ వాటర్ బాడీస్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వ్యవసాయ ఉత్పత్తులకు, మానవాళి బతికేందుకు నీరు ఎంతో అవసరమన్నారు. న్యాచురల్ వాటర్‌ను కాపాడేందుకు ప్రభుత్వానికి తోడుగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని వాటర్‌సోర్స్‌ను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ గంగాధర్‌రావు, కార్యదర్శి జీవీ రంగారెడ్డి, ఇతర ప్రతినిధులు ఆదిత్యమార్గం, సురేందర్‌రెడ్డి, డాక్టర్ వంశీతిలక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

అబిడ్స్: రాష్ట్ర ఆటపా ఫైనాన్స్ కార్యదర్శి కందికొండ శ్రీనివాస్‌కు రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డును విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, హోంమంత్రి మహమూద్ అలీ అందజేశారు. నల్లమల్ల అటవీప్రాంతం మన్ననూర్‌కు చెందిన కందికొండ శ్రీనివాస్ చెన్నారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఎన్నో ఏళ్లుగా బోధిస్తున్నారు. గణితంలో విశేష ప్రతిభ కనబరిచే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఆయనకు మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనకు రాష్ట్రస్థాయి బెస్ట్ టీచర్ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మరింత రెట్టింపు ఉత్సాహంతో గణితంలో విద్యార్థులకు ప్రయోగాత్మక బోధనలు చేస్తానన్నారు.



శ్రీనివాస్‌కు అవార్డు అందజేస్తున్న సబితా ఇంద్రారెడ్డి, మహమూద్‌అలీ



వేడుకల్లో గోల్కొండ ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

నయాఖీలాలో..

గోల్కొండ: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గోల్కొండ ఉర్దూ హై స్కూల్ అకాడామీక్ హెడ్ సమీనాతన్వీర్ అన్నారు. మంగళవారం గోల్కొండ నయాఖీలాలోని ఉర్దూ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

కంచన్‌బాగ్‌లో..

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని హఫీజ్‌బాబానగర్ ఫైజ్–ఈ–రజా ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివ చంద్ర హాజరయ్యారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ శివ చంద్ర, ఉపాధ్యాయులను పాఠశాల యజమాన్యం ఘనంగా సత్కరించారు.

సద్గుణకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ..

నాంపల్లి: ఆసిఫ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో గణిత శాస్త్రా ఉపాధ్యాయురాలు సద్గుణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2023ను మంగళవారం జిల్లా విద్యాశాఖా అధికారిణి ఆర్.రోహిణి చేతుల మీదుగా స్వీకరించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా స్వర్ణలత..

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు స్వర్ణలతకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు.



ఇన్‌స్పెక్టర్ శివచంద్రను సన్మానిస్తున్న నిర్వాహకులు



అవార్డును స్వీకరిస్తున్న సద్గుణ



స్వర్ణలతను సన్మానిస్తున్న నిర్వాహకులు

పురుషోత్తమాచార్యకు అభినందనలు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్యకు జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సత్కళభారతి ఆధ్వర్యంలో ప్రముఖ సినీ విమర్శకులు డాక్టర్ ఎం.పురుషోత్తమచార్య అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఛలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కురుమాచలం, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖ కవి వడ్డేపల్లి కృష్ణ, సత్కళా భారతి వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పురుషోత్తమాచార్యను సన్మానిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

మౌలిక వసతుల కల్పనకు కృషి: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్‌లోని మహబూబ్ ఫ్రైడ్ ఫంక్షన్‌హాల్‌లో కార్వాన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు వివిధ రకాల సామగ్రీ, ఫర్నిచర్‌ను వాటి ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తుందని అయితే పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు పెరగడం లేదని ఆయన అన్నారు. పాఠశాలల అభివృద్ధికి తాను జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ అధికారులను కూడా కలిసి వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మజ్లిస్ నాయకులతో పాటు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులతో ఎమ్మెల్యే కౌసర్

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని బీజేపీ మహిళా మోర్చా జాతీయ నాయకురాలు డాక్టర్ వి.పద్మ అన్నారు. మంగళవారం ఎల్బీస్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో హైదరాబాద్ జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రికెట్, బాడ్మింటిన్ క్రీడలతో ఇతర క్రీడలకు కూడా సరైన ఆదరణ, ప్రచారం కావాలన్నారు. అనంతరం హైదరాబాద్ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్‌గా కె.మోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఎం.త్యాగరాజు, ప్రధాన కార్యదర్శి జోసెఫ్ జేమ్స్, కోశాధికారిగా టి.కౌశిక్, ఉపాధ్యక్షులుగా ఎం.నాగరాజు, బి.లక్ష్మీ నారాయణయాదవ్‌లతో పాటు పలువురు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న డాక్టర్ పద్మ తదితరులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684